సాక్షి
జగిత్యాల
బుధవారం ; 26 ; ఫిబ్రవరి ; 2025



ఘనంగా దుబ్బరాజన్న కల్యాణం

సారంగాపూర్: మహాశివరాత్రి సందర్భంగా దుబ్బరాజన్న స్వామివారి కల్యాణాన్ని మంగళవారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. కలెక్టర్ సత్యప్రసాద్ స్వామివారు, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, ఆలయ ఈవో అనూష, వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య, ఆలయ సిబ్బంది వారికి స్వాగతం పలికారు. అర్చకులు రామోజుల చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు రాజన్న కల్యాణతంతును పూర్తి చేశారు. మహాశివరాత్రి సందర్భంగా స్వామివారిని రెండు లక్షల మంది భక్తులు దర్శించుకుంటారని అధికారులు అంచనా వేస్తున్నారు.



బడిలో మోగని వాటర్ బెల్

- డీహైడ్రేషన్ బారిన విద్యార్థులు
- నీరు తాగక అనారోగ్యంపాలు
- నీటిగంట తప్పనిసరి అంటున్న తల్లిదండ్రులు



నీరు తాగుతున్న విద్యార్థులు

జగిత్యాల: అసలే పదో తరగతి పరీక్షలు.. మార్కులే లక్ష్యంగా విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొస్తున్నారు. కానీ.. విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. విద్యార్థులు సరిపడా నీరు తాగకపోవడంతో తలనొప్పి, కడుపునొప్పి, నీరసం బారినపడుతున్నారు. ఇలాంటి ప్రాథమిక లక్షణాలను గుర్తించిన ప్రభుత్వం 2018లో పాఠశాలల్లో ప్రతి గంటకోసారి వాటర్ బెల్ మోగించాలని నిర్ణయించింది. కానీ.. కోవిడ్ తర్వాత దీని గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా ఉండాలంటే ముఖ్యంగా వారికి నీరు బాగా తాగించాలని వైద్యులు చెబుతుంటారు. నీరు సరైన మోతాదులో లేకపోతే విద్యార్థులు అనారోగ్యానికి గురై ఏకాగ్రత దెబ్బతిని చదువుపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో చాలామంది నిపుణులు, వైద్యులు శరీరానికి సరిపడా నీరు తాగడం ప్రధానమని పేర్కొంటున్నారు.

అందని నీరు

ప్రభుత్వ పాఠశాలల్లో వాటర్ బెల్ కార్యక్రమాన్ని 2018లో విద్యాశాఖ ప్రారంభించింది. కోవిడ్ తర్వాత మళ్లీ పాఠశాలలు పునఃప్రారంభమైనప్పటి నుంచి ఎవరూ దాని గురించి పట్టించుకోలేదు. విద్యార్థులు బడి సమయంలో సుమారు 1.5 లీటర్ల నీరు తీసుకుంటే మంచిదని వైద్యులు పేర్కొంటున్నారు. వయస్సును బట్టి 3 నుంచి 4 లీటర్లు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ విద్యార్థులు ఉదయం ఇంటి నుంచి వాటర్‌బాటిల్ తీసుకెళ్తున్నా.. లంచ్ సమయంలో తప్ప మరెప్పుడూ తాగడం లేదు. దీంతో వారి శరీరానికి కావాల్సిన నీరు అందక ఇబ్బందికి గురవుతున్నారు. గతంలో ఫస్ట్‌బెల్, సెకెండ్ బెల్, ఇంటర్వెల్ ఇలా ఏర్పాటు చేసినప్పటికీ ప్రస్తుతం అది మర్చిపోయారు. ఇప్పటికైనా దీనిని ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎండకాలం మరింత తీవ్రం

ప్రస్తుతం ఎండకాలం నీరు ఎంతో అవసరం. ఒకవేళ నీరు లేకపోతే శరీరం ఎక్కువగా డీహైడ్రేషన్‌కు లోనవుతుంది. ప్రతి ఒక్క విద్యార్థి స్కూల్‌కు వెళ్లే సమయంలో వాటర్‌బాటిల్ తీసుకుని ప్రతి గంటకు ఒకసారి తాగాల్సి ఉంటుంది. లేదా పాఠశాలల్లోనే విద్యార్థులకు అవసరమైన తాగునీటిని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

నీరు తగ్గితే వ్యాధుల పాలు

ఎండకాలంలో శరీరంలోని అన్ని అవయవాలు సమర్థవంతంగా పనిచేయాలంటే మోతాదులో నీరు తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది. నీరు ఎక్కువగా తీసుకుంటే రక్తం పలచగా మారి రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది. ఒకవేళ నీటి శాతం తగ్గితే మూత్రపిండాల్లో రాళ్లు, విద్యార్థుల్లో ముఖ్యంగా జ్వరం, మూత్రంలో ఇన్ఫెక్షన్, అసిడిటీ, మలబద్ధకం, మూర్ఛ, కాలేయ, చర్మ వ్యాధుల వంటి సమస్యలు వస్తాయి.

భయంతో తాగని విద్యార్థులు

జిల్లాలోని చాలా పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం ఉంది. అయితే గంటకోసారి నీరు తాగితే మూత్రం వస్తుందన్న కారణంతోనూ విద్యార్థులు పెద్దగా పట్టించుకోవడం లేదు. కొన్ని పాఠశాలల్లో సరిపడా మూత్రశాలలు లేకపోవడం కూడా ప్రధాన సమస్యగా మారింది. ఈ క్రమంలో నీరు సరిపడా తాగకపోవడంతో వివిధ వ్యాధులకు గురవుతున్నారు. ఉపాధ్యాయులు వారిలో భయాన్ని పోగొట్టి ప్రతి గంటకోసారి నీరు తాగేలా చూడాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వాటర్‌బెల్‌తో ప్రయోజనం



ఉదయం 9 గంటలకు పాఠశాలకు వెళ్తాం. పీరియడ్ తర్వాత పీరియడ్ జరుగుతుంది. మధ్యలో వాటర్ బెల్ ఉంటే మాకు ప్రయోజనంగా ఉంటుంది. పీరియడ్ తర్వాత మేం మరో పీరియడ్‌లోకి వెళ్లిపోతాం. వాటర్ బెల్ అవకాశం కల్పించాలి.

– సాయిసవర్థిక, విద్యార్థి

నీరు తాగడం ముఖ్యం



ఎండకాలంలో విద్యార్థులకు నీరు ఎంతో ముఖ్యం. కోవిడ్ సమయంలో వాటర్‌బెల్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. తర్వాత పెద్దగా పట్టించుకోలేదు. మళ్లీ దానిని పునరుద్ధరించాలి. మంచినీరు తాగడం వల్ల విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారు.

– బైరం హరికిరణ్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

అమలు తప్పనిసరి చేయాలి



విద్యార్థులు గంటకోసారి నీరు తాగేలా చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు కూడా అవగాహన కల్పిస్తున్నాం. ఎండకాలంలో తగినన్ని నీరు తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారు. కేవలం ఇంటర్వెల్ సమయంలోనే తాగుతున్నారు.

– మచ్చ శంకర్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

రెండు లీటర్లు తీసుకోవాలి



విద్యార్థులు ప్రతిరోజూ రెండు లీటర్ల నీరు తీసుకోవాలి. అప్పుడే శరీరంలోని అవయవాలు సక్రమంగా పనిచేస్తాయి. నీరు తాగడం.. మూత్ర విసర్జన చేయడం ముఖ్యమని విద్యార్థుల్లో అవగాహన పెంచాలి. రెండు గంటలకోసారి 250 మి.లీ నీరు తాగడం మంచిది.

– ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, ఫిజీషియన్

ముగిసిన ఎమ్మెల్సీ ప్రచార పర్వం



నరేందర్‌రెడ్డి



అంజిరెడ్డి



ప్రసన్న హరికృష్ణ



సర్దార్ రవీందర్‌సింగ్



వంగ మహేందర్‌రెడ్డి



మల్క కొమురయ్య



కూర రఘోత్తమరెడ్డి



అశోక్‌కుమార్

- కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ పోటాపోటీ సభలు
- పార్టీల క్యాడర్‌లో జోష్
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

సాక్షి ప్రతినిధి,కరీంనగర్: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం పర్వం ముగిసింది. నిబంధనల మేరకు పోలింగ్‌కు 48 గంటల ముందు మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి సైలెంట్ మోడ్ అమలులోకి వచ్చింది. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుపై ప్రధాన పార్టీలు, సంఘాలు ధీమాగా ఉన్నాయి. కాంగ్రెస్ పక్షాన సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు, బీజేపీ తరఫున కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఎస్పీ తరఫున బీసీ నేతలు నిర్వహించిన సభల సక్సెస్‌తో ఆయా క్యాడర్ జోష్‌లో ఉంది.

ఉమ్మడి కరీంనగర్ కీలకం

కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కీలకంగా మారింది. ఉమ్మడి జిల్లా ఓటర్లు ఎటు మొగ్గితే వాళ్లు విజయం సాధించే అవకాశాలున్నాయి. పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 3 లక్షల 55 వేల 159 ఓట్లు ఉండగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి లక్షా 60 వేల 260 ఓట్లున్నాయి. అంటే ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి దాదాపు సగం ఓట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్నాయి. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓటర్ల తీర్పుపైనే అభ్యర్థుల భవిత ఆధారపడి ఉంది. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి మొత్తం 27,088 ఓట్లు ఉండగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 8,135 ఓట్లున్నాయి. ఇక్కడ కూడా ఉమ్మడి కరీంనగర్ జిల్లా గెలుపోటములను నిర్ణయించనుంది.

గెలుపుపై ధీమా

పట్టభద్రులకు సంబంధించి మొత్తం 56 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ అభ్యర్థుల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. అంజిరెడ్డి, నరేందర్‌రెడ్డి పార్టీల బలంపై, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ బీసీ వాదంపై ఆశలు పెట్టుకున్నారు. సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, ట్రస్మా మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 15 మంది పోటీలో ఉండగా, బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య, పీఆర్‌టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, టీపీటీఎఫ్, యూటీఎఫ్, యూఎస్‌పీసీ మద్దతుతో వై.అశోక్‌కుమార్, ఎస్‌టీయూ, సీపీఎస్‌ల నుంచి పోటీలో ఉన్న కూర రఘోత్తంరెడ్డి మధ్య పోటీ నెలకొంది.

ప్రచారసభలతో జోష్

గతంలో లేని విధంగా ఈ సారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారం హోరెత్తింది. కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ఏకంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రచార సభలు నిర్వహించి తమకు ఓటెందుకు వేయాలో వివరించే ప్రయత్నం చేశారు. సీఎంతో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రచార బాధ్యతలు నిర్వర్తించారు. అలాగే బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్య గెలుపు బాధ్యతలను పూర్తిగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ భుజానికెత్తుకొన్నారు. కామారెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, పాయల్ శంకర్ ప్రచారపర్వంలో పాల్గొన్నారు. బీసీ వాదంతో బరిలోకి దిగిన బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా బీసీ జేఏసీ రాష్ట్ర నేతలు, బీసీ సంఘాల నేతలు, ఓయూ జేఏసీ, కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్‌మార్ మల్లన్న ప్రచారం నిర్వహించారు. ఆయా సభల విజయవంతంతో క్యాడర్‌లో జోష్ నెలకొనడంతో పాటు, గెలుపుపై ధీమా పెరిగింది.

స్త్రీనిధి లక్ష్యాలు పూర్తిచేయాలి

జగిత్యాలరూరల్: గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సెర్ప్, స్త్రీనిధి లక్ష్యాలు పూర్తిచేయాలని డీఆర్‌డీవో రఘువరణ్ అన్నారు. కలెక్టరేట్‌లో సిబ్బందితో సమీక్షించారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున లక్ష్యం చేరుకోవాలన్నారు. స్త్రీనిధి జోనల్ మేనేజర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొలాలు ఎండిపోతున్నా పట్టదా..?

- 15 నెలలైనా ప్రాజెక్టుకు పట్టర్లు బిగించరా..
- రైతులు మొత్తుకుంటున్నా కనికరం లేని ప్రభుత్వం
- రోళ్లవాగును పరిశీలించిన బీఆర్‌ఎస్ నాయకులు



రోళ్లవాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్, విద్యాసాగర్‌రావు

సారంగాపూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చి 15 నెలలవుతున్నా రోళ్లవాగు ప్రాజెక్టుకు కనీసం షట్టర్లు బిగించలేదని, ఫలితంగా ప్రాజెక్టు కింద పొలాలు ఎండిపోతున్నాయని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టును బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావుతో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 2017లో కేసీఆర్ హయాంలో ప్రారంభించిన ప్రాజెక్టు పనులు 90శాతం పూర్తయ్యాయని, కేవలం అటవీశాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉందని, గేట్లు బిగిస్తే బీర్‌పూర్, ధర్మపురి మండలాల్లోని 15 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. 15 నెలలుగా కాలయాపన చేయడం ద్వారా పంటలు ఎండిపోతున్నాయన్నారు. దీనిపై కలెక్టర్ సమీక్షించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఇటీవల గోదావరిలోకి టీఎంసీ నీటిని విడుదల చేయడం ద్వారా ఎత్తిపోతల పథకం కింద పొలాలకు నీరు అందుతోందని, రానున్న రోజుల్లో నీరు అందకుంటే 50వేల ఎకరాలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. సన్నరకాలకు రూ.500 బోనస్ ఇస్తామన్న ప్రభుత్వం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇప్పటివరకు కేవలం మూడెకరాలలోపున్న కొంతమందికే రైతుభరోసా జమ అయ్యిందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు నిర్దిష్టమైన ఆలోచన లేదని, దోపిడీ కోసమే సమయం వెచ్చిస్తున్నారని విమర్శించారు. విద్యాసాగర్‌రావు మాట్లాడుతు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ప్రాజెక్టులపై అవగాహన లేదని, విమానాలు మాత్రం నడపడం తెలుసుని ఎద్దేవా చేసారు. వారి వెంట జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

జగిత్యాలటౌన్: ఎమ్మెల్సీగా నరేందర్‌రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. మంగళవారం జిల్లాకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తొలి ఏడాదిలోనే 55వేల ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించడం గొప్ప నిర్ణయమన్నారు. ఐటీఐ కళాశాల అప్‌గ్రేడ్, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. తనను ఆదరించినట్లుగానే నరేందర్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. నాయకులు బండ శంకర్, గాజంగి నందయ్య, గాజుల రాజేందర్, ధర రమేశ్, మన్సూర్, నేహాల్, జున్ను రాజేందర్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

తాగునీటి ఎద్దడి రానీయొద్దు



పైడిమడుగులో బోరింగ్ పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్.లత

కోరుట్లరూరల్: వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని అదనపు కలెక్టర్ బీఎస్.లత అన్నారు. మండలంలోని పైడిమడుగు గ్రామాన్ని మంగళవారం సందర్శించిన ఆమె గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య పనులపై ఆరా తీశారు. చేతిపంపును పరిశీలించి తాగునీటి సమస్య తెలుసుకున్నారు. పారిశుధ్యంపై అలసత్వం తగదని, ఇంటి పన్నులు వందశాతం వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో జీవాకర్, తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ రామకృష్ణ, కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.


వైజ్ఞానిక ప్రదర్శనలతో నైపుణ్యం




ప్రదర్శనలను తిలకిస్తున్న జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్

రాయికల్: వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లోని నైపుణ్యం పెంపొందుతుందని జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ అన్నారు. మండలంలోని కుమ్మరిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలను సందర్శించారు. విద్యార్థి దశ నుంచే సైన్స్ పట్ల ఆసక్తి కనబర్చడం ద్వారా శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశం ఏర్పడుతుందన్నారు. హెచ్‌ఎం అభయ్‌రాజ్, ఎంపీవో సుష్మ, ఎంఈవో శ్రీపతి రాఘవులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ బొప్పారపు మానస, ఉపాధ్యాయులు బెజ్జంకి హరికృష్ణ, కడకుంట్ల వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ముస్తాబైన ఆలయాలు



ముస్తాబైన పొరండ్ల రామలింగేశ్వరస్వామి దేవాలయం



మల్లాపూర్ సోమేశ్వర కొండపైన ముస్తాబైన శ్రీకనక సోమేశ్వర స్వామి ఆలయం



దుబ్బరాజేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లను సమీక్షిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలరూరల్/సారంగాపూర్/మల్లాపూర్: మహాశివరాత్రికి జిల్లాలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. జగిత్యాల మండలం పొలాసలోని పొలస్తేశ్వరస్వామి, సహస్ర లింగాల, పొరండ్లలోని రామలింగేశ్వరస్వామి, జాబితాపూర్‌లోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు.

కోరిన కొర్కెలు తీర్చే కనకసోమేశ్వరుడు

మల్లాపూర్ మండలకేంద్రంలోని సోమేశ్వర కొండపై కొలువైన శ్రీకనకసోమేశ్వరుడు కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా ప్రసిద్ధిగాంచారు. ప్రకృతి అందాల మధ్య కొండపై వెలిసిన స్వామివారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుండి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరానున్నారు. ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఉత్సవాల ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.

దుబ్బరాజన్నకు పటిష్ట పోలీస్ బందోబస్తు

సారంగాపూర్ మండలంలోని దుబ్బరాజన్న ఆలయంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. దుబ్బరాజన్న స్వామివారిని దర్శించుకున్న ఆయన పోలీసులు, ఆలయ, వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు.

స్వామివారిని దర్శించుకున్న బీఆర్‌ఎస్ ప్రముఖులు

దుబ్బరాజన్న స్వామివారిని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత దర్శించుకున్నారు. అర్చకులు వారికి ఆశీర్వాదం అందించి, స్వామివారి ప్రసాదాలు బహూకరించారు.

శానిటేషన్‌పై నిర్లక్ష్యం వద్దు

దుబ్బరాజన్న జాతరలో పారిశుద్ధ్యంపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అడిషనల్ డీఆర్‌డీవో, డీపీవో మదన్‌మోహన్ అన్నారు. దుబ్బరాజన్న జాతర స్థలం, ఆలయ పరిసరాలు, కోనేరును పరిశీలించారు. వివిధ పంచాయతీల నుంచి 100 మంది సిబ్బందిని శానిటేషన్ కోసం నియమించామన్నారు. 14 మంది పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో, ఎంపీవో మూడు రోజుల పాటు ఇక్కడే ఉంటారని పేర్కొన్నారు.

ఎములాడ దారిలో..

- వైభవంగా రాజన్న జాతర షురూ
- తరలివస్తున్న భక్తులు
- నేడు మహాశివరాత్రి వేడుకలు
- రూ.2.39 కోట్లతో ప్రత్యేక ఏర్పాట్లు
- గుడి చెరువులో శివార్చన కార్యక్రమాలు ప్రారంభం
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం, విప్ ఆది, టీటీడీ అర్చకులు




విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్న వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం

వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎములాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం మహాశివరాత్రి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే భక్తులు తరలివస్తున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు రాజన్నను దర్శించుకుని, కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. జాగరణ కోసం అంతా సిద్ధం చేసుకుంటున్నారు. కాగా, మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆర్జిత సేవలన్నింటినీ రద్దు చేసి కేవలం లఘు దర్శనాలకు మాత్రమే అనుమతించారు. రూ.2.39 కోట్లతో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. గుడి చెరువులో రాష్ట్ర సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో శివార్చనలో భాగంగా 1,500 మంది కళాకారులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో జాగరణ చేసే భక్తులకు గుడి చెరువు వేదిక కానుంది. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి పేయిడ్ పాస్‌లను అధికారులు జారీ చేశారు. జాతరకు ఈసారి 4 లక్షల మంది వరకు వివిధ ప్రాంతల నుంచి భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు.



స్వామివారి సన్నిధిలో మంత్రి పొన్నం ప్రభాకర్



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న టీటీడీ సిబ్బంది



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

రాష్ట్ర ప్రభుత్వం పక్షాన స్వామివారికి మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్ పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు సైతం స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు.

నేటి ఉత్సవాల్లో..

- వేకువజామున 3.30 నుంచి 4 గంటల వరకు ఆలయ శుద్ధి, మంగళవాయిద్యాలు
- ఉదయం 4 నుంచి 4.25 వరకు సుప్రభాత సేవ
- సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు శివస్వాములకు ప్రత్యేక దర్శనం
- సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామివారి కల్యాణ మంటపంలో మహాలింగార్చన
- రాత్రి 11.35 నుంచి వేకువజాము 3.30 గంటల వరకు లింగోద్భవ కాలమందు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం

క్లుప్తంగా

చికిత్స పొందుతూ మహిళ మృతి

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన బాలె తేజస్విని (32) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెదిరకు చెందిన మీసాల కాంతయ్య కూతురు తేజస్వినిని 2020లో గాంధీనగర్‌కు చెందిన బాలె సాయిరాజ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి కూతురు (3) సంతానం. కొద్దికాలంగా తేజస్విని కడుపునొప్పితో బాధ పడుతోంది. జనవరి 31న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. కొద్దిరోజుల క్రితం కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు ప్రయత్నించినా లాభంలేకపోయింది. మృతురాలి తండ్రి మీసాల కాంతయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం


ముక్కెరాల చంద్రయ్య (ఫైల్)

కోరుట్లరూరల్: మండలంలోని మాదాపూర్‌కు చెందిన ముక్కెరాల చంద్రయ్య (70) మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చంద్రయ్య సైకిల్‌పై వెంకటాపూర్ వెళ్లి తిరిగి మాదాపూర్ వస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన అంజా ట్రాక్టర్ నడుపుతూ వెంకటాపూర్ వైపు వెళ్తున్నాడు. కాకతీయ కాలువ డీ–40 మూలమలుపు వద్ద చంద్రయ్య ట్రాక్టర్‌ను ఢీకొట్టి రోడ్డు కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. చంద్రయ్య కుటుంబానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బంధువులు డ్రైవర్ అంజి ఇంటి ఎదుట ధర్నాకు దిగారు. స్థానిక నాయకులు సముదాయించి ధర్నాను విరమింప చేశారు. చంద్రయ్య బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగిసిన అంతర్రాష్ట్ర క్రీడలు

- క్రీడల విభాగంలో ఓవరాల్ చాంపియన్ షిప్ రాజేంద్రనగర్, ఉత్తర తెలంగాణ జట్టు
- విజేతలకు బహుమతులు ప్రదానం


మాట్లాడుతున్న ఝాన్సీరాణి


బహుమతి అందుకుంటున్న రాజేంద్రనగర్ జట్టు

జగిత్యాల అగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానంలో మూడు రోజులుగా జరుగుతున్న అంతర్రాష్ట్ర క్రీడా, సాంస్కృతిక పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీలకు వ్యవసాయ వర్సిటీ డీన్ ఆప్ అగ్రికల్చర్ డాక్టర్ కె. ఝాన్సీరాణి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసంతోపాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతీ నారాయణ్ భట్ మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి వర్సిటీ క్రీడలకు పొలాస కళాశాల వేదిక కావడం అభినందనీయమన్నారు. వ్యవసాయ పరిశోధనా స్థానం డైరెక్టర్ శ్రీలత మాట్లాడుతూ పోటీల్లో పాల్గొడడం వల్ల క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. వ్యవసాయ వర్సిటీ క్రీడా పరిశీలకులు డాక్టర్ సురేశ్, వర్సిటీ నాన్ టీచింగ్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, జయరాం, కళాశాల స్టూడెంట్ అఫైర్ కన్వీనర్ మహేశ్ రెడ్డి, క్రీడా ఇన్‌చార్జి రత్నాకర్, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, నాన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ షిప్ రాజేంద్రనగర్ జట్టు

రాష్ట్రస్థాయి క్రీడల విభాగంలో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను రాజేంద్రనగర్ జట్టు కైవసం చేసుకోగా, సాంస్కృతిక విభాగంలో ఓవరాల్ చాంపియన్ షిప్‌ను ఉత్తర తెలంగాణ జట్టు కైవసం చేసుకుంది. క్రికెట్‌లో దక్షిణ తెలంగాణ జట్టు, వాలీబాల్‌లో మధ్య తెలంగాణ జట్టు, బాల్ బ్యాడ్మింటన్‌లో ఉత్తర తెలంగాణ జట్టు, షటిల్ బ్యాడ్మింటన్‌లో రాజేంద్రనగర్ జట్టు, టేబుల్ టెన్నిస్‌లో రాజేంద్రనగర్ జట్టు, చెస్‌లో మధ్య తెలంగాణ జట్టు, కార్యమ్‌లో మధ్య తెలంగాణ జట్టు విజయం సాధించాయి. వివిధ జోన్లకు చెందిన క్రీడాకారులు బహుమతులు అందుకున్నారు.

మూడు రోజులు ఉత్సాహంగా



మూడు రోజులు క్రీడాపోటీల్లో ఉత్సాహంగా సాగాయి. వివిధ క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది.
– అయేషా, అడ్మినిస్ట్రేటివ్ జోన్, హైదరాబాద్

స్నేహభావం పెంపు



క్రీడాపోటీల్లో పాల్గొనడంతో కొత్తవారితో స్నేహభావం పెంపొందుతుంది. మూడు రోజులు నిర్వహించిన క్రీడా పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నాం.
– సుకన్య, రాజేంద్రనగర్ జోన్

టీం సహకారంతో..



ఒక్కరిగా కాకుండా టీం సహకారంతో చాలా పతకాలు గెలుచుకున్నాం. క్రీడా, సాంస్కృతిక పోటీలు ఉత్తేజం నింపాయి. క్రీడా పోటీల నిర్వహణ బాగుంది.
– అనురాధ, ఉత్తర తెలంగాణ జోన్

యువత ఉపాధి వైపు అడుగులు వేయాలి


సర్టిఫికెట్లు అందిస్తున్న పీడీ రఘువరన్

మల్యాల: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ యువత స్వయం ఉపాధివైపు అడుగులు వేయాలని డీఆర్డీవో పీడీ రఘువరన్ అన్నారు. మండలంలోని మద్దుట్లలో ఉపాధి హామీ నిధులు ఏర్పాటు చేసిన పశువుల పాకను మంగళవారం పరిశీలించారు. పోతారంలో ఉపాధి హామీ కింద చేపట్టిన కందకం పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. మండలకేంద్రంలో ఉన్నతి పథకం కింద పుట్టగొడుగుల పెంపకంపై ఆరురోజులు శిక్షణ పొందిన 70 మంది యువతకు సర్టిఫికెట్లు అందించారు. అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్, ఎంపీడీఓ స్వాతి, ఏపీఓ శ్రీనివాస్, ఈసీ మనోజ్, టెక్నికల్ అసిస్టెంట్ జలపతి రెడ్డి, లావణ్య, శిక్షకులు బాలస్వామి, విజయభారతి పాల్గొన్నారు.

పంటలను ముంచేసిన వరదకాల్వ బ్యాక్ వాటర్


ఆత్మనగర్ పెద్దతండా సమీపంలో మునిగిన వరి పంట

మెట్‌పల్లిరూరల్: ఎస్సారెస్పీ వరదకాలువ బ్యాక్ వాటర్ మెట్‌పల్లి మండలం ఆత్మనగర్ పెద్దతండా శివారులోని పొలాలను ముంచేసింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి వరదకాల్వకు రెండు రోజుల క్రితం అధికారులు 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఆ నీటితో కాలువ నిండుగా ప్రవహిస్తోంది. జగ్గాసాగర్ శివారులోని మాన్వారు వాగు వద్ద వరదకాల్వ.. ఆత్మకూర్ పెద్దవాగు కలుస్తాయి. వరద కాలువ నుంచి వస్తున్న నీరు పెద్దవాగుపైనుంచి ప్రవహిస్తోంది. ఈ క్రమంలో వరదకాల్వ బ్యాక్ వాటర్ పెద్దవాగు గుండా నల్ల ఒర్రె ద్వారా ఆత్మనగర్ పెద్దతండా శివారులోని పంట పొలాల్లోకి చేరుతున్నాయి. ఈ కారణంగా సుమారు 20 ఎకరాల వరకు వరి పంట నీట మునిగినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాన్వార్ వాగు వద్ద గేట్లు ఎత్తి పెద్దవాగు దిగువ ప్రాంతానికి నీటిని వదిలితే పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

- ఎస్పీ అశోక్‌కుమార్
- కేంద్రాల పరిశీలన


కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ

జగిత్యాలక్రైం/మల్లాపూర్: ఈనెల 27న జరగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల వద్ద శాంతిభద్రతలు సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లావ్యాప్తంగా 71 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ యాక్ట్ 144 సెక్షన్ అమలులో ఉంటుందని, 200 మీటర్ల పరిధిలో ఆంక్షలు ఉంటాయన్నారు. ఎవరైనా నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐలు నిరంజన్‌రెడ్డి, ఎస్సై రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మల్లాపూర్ మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ పరిశీలించారు.

అనారోగ్యంతో మాజీ డీఈవో మృతి


నర్సింగరావ్ (ఫైల్)

ధర్మపురి: ఉమ్మడి జిల్లా మాజీ డీఈవో ఇందారపు నర్సింగరావు (95) సోమవారం అర్ధరాత్రి మృతిచెందారు. ధర్మపురికి చెందిన ఈయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈయన ధర్మపురిలోని సంస్కృతాంధ్ర కళాశాల, ఉన్నత పాఠశాల పురోగతికి, జగిత్యాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద నున్న ఓల్డ్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వర్తించారు. ఆయనకు మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. నర్సింగరావు మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

అడవి పందుల దాడిలో తీవ్రగాయాలు

చందుర్తి: అడవిపందుల దాడిలో వేటగాళ్లకు తీవ్ర గాయాలయిన ఘటన చందుర్తి శివారులోని బోడ గుట్ట ప్రాంతంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జోగాపూర్ గ్రామానికి చెందిన సంచార జీవనం సాగించేవారితో అడవి పందుల వేటకు వెళ్లారు. అప్పటికే వారికి పంది చిక్కగా, మరో దానికోసం వేటాడుతుండగా దాడిచేసింది. ఓ వ్యక్తికి తీవ్రగాయాలు కాగా, మరో వ్యక్తికి స్వల్పంగా గాయపడినట్లు సమాచారం. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని 108లో వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం లింగంపేట శివారులోని ఓ గుట్టకు విద్యుత్ షాక్ పెట్టి మూడు పందులను హతమార్చి మాంసాన్ని విక్రయించినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై అటవీశాఖ అధికారి వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం లేదని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

కోనరావుపేట: కళాశాల నుంచి వస్తూ అదృశ్యమైన విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. హైదరాబాద్‌లో రైలు కిందపడి మృతి చెందినట్లు తల్లిదండ్రులకు సమాచారం అందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన పొట్ల బాలమల్లు– మంజుల దంపతుల కుమారుడు రాకేశ్ (18)హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం ఇంటికి వస్తూ సిరిసిల్ల బస్టాండ్‌లోని ధర్మారం గ్రామానికి వెళ్తున్న ఆటోలో బ్యాగు పెట్టాడు. తర్వాత కనిపించకపోవడంతో తల్లిదండ్రులు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రాకేశ్ హైదరాబాద్‌లోని కాచిగూడ రైల్వేస్టేషన్ సమీపంలో సూసైడ్ నోట్ రాసి రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం అందింది. అమ్మ, నాన్న క్షమించండి. నాకు బతకాలని లేదు. నా చావుకు కారణం ఎవరు కాదు అని సూసైడ్ నోట్‌లో అంది. పోలీసులు ఫోన్‌లో తల్లిదండ్రులకు సమాచారం అందించారు. రాకేశ్ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

భక్తులకు సరిపడా ఏర్పాట్లు

ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్ : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కోటిలింగాల కోటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంగళవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు ప్రైవేటు కంపెనీ నిర్మించిన శాశ్వత షెడ్, టాయిలెట్స్‌ను ప్రారంభించారు. బందోబస్తు చేపట్టాలని సీఐ రాంనర్సింహారెడ్డిని ఆదేశించారు. గోదావరిలో గజ ఈతగాళ్లను నియమించామన్నారు. ఈవో కాంతారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గోళ్ల తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

స్వగ్రామానికి చేరిన యువకుడు


పాస్‌పోర్టుతో శ్రీకాంత్

జగిత్యాలక్రైం: మోసపూరిత విదేశీ నియామక సంస్థ చేతుల్లో మోసపోయిన కొడిమ్యాల మండలం చెప్యాలకు చెందిన వలస కార్మికుడు కడకుంట్ల శ్రీకాంత్ పలువురి సహాయంతో మంగళవారం స్వగ్రామం చేరాడు. శ్రీకాంత్‌ను 40 రోజల క్రితం జగిత్యాలకు చెందిన మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ ఎలక్ట్రీషియన్ ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చి దుబాయ్ పంపించింది. అక్కడికి చేరిన అనంతరం లేబర్ ఉద్యోగంలో చేర్పించారు. ఆ పని చేయబోనని శ్రీకాంత్ అనడంతో పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకుని 7300 దిరమ్స్ (ఇండియా రూ.2లక్షలు) చెల్లించాలని కంపెనీ యాజమాన్యంతోపాటు, కేరళకు చెందిన ఓ ఏజెంట్ బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు టీపీసీసీ ఎన్ఆర్ఐసెల్ కన్వీనర్ షేక్ చాంద్‌పాషాను ఆశ్రయించారు. ఆయన దుబాయ్‌లోని ఇండియన్ ఎంబసీకి సమాచారం అందించారు. స్పందించిన ఎంబసీ వారు కంపెనీ యాజమాన్యాన్ని మందలించడంతో శ్రీకాంత్‌ను స్వగ్రామానికి పంపించేందుకు నిరాకరించారు. దీంతో ఇండియన్ ఎంబసీ దుబాయ్ ప్రభుత్వాన్ని ఆశ్రయించింది. లేబర్ కోర్టు విచారణ జరపగా శ్రీకాంత్ కోర్టులో నెగ్గాడు. దీంతో కంపెనీ యాజమాన్యం ఫిర్యాదును కొట్టివేసి అతని పాస్‌పోర్టును శ్రీకాంత్‌కు అప్పగించడంతో మంగళవారం స్వగ్రామానికి చేరుకున్నాడు.



సాంబశివుని సన్నిధిలో గీతాహవన యజ్ఞం

బుగ్గారం: మండలకేంద్రంలో కొలువైన శ్రీసాంబశివుని నాగేశ్వరాలయంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గీతాహవన యజ్ఞాన్ని కనులపండువగా నిర్వహించారు. విశ్వశాంతి, పర్యావరణ పరిరక్షణ, లోకకల్యాణార్థం ఆదిలాబాద్ జిల్లా రోటిగూడెంకు చెందిన శ్రీహరిమౌన స్వామిజీ పర్యవేక్షణలో ఆలయ చైర్మన్ మసర్తి రాజిరెడ్డి ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమపూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ అర్చకులు సాత్పడి రంగయ్య, వేద పండితులు శ్రీపాద లక్ష్మీనరసింహశాస్త్రి, రామస్వామి, కంచర్ల శివశంకరాచార్యులు, అగస్త్య మహారాజ్, ప్రమోద్‌శర్మ, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి, శ్రీమద్భగద్గీత సత్సంగ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఈత చెట్లు దగ్ధం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయ శివారులో ఈత చెట్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన గౌడ కులస్తులు మూడేళ్ల క్రితం ఐదు ఎకరాల్లో సుమారు 6 వేల వరకు ఈత చెట్లు నాటారు. వాటిపై ఆధారపడి కొద్దిరోజుల నుంచి కల్లుగీస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం రాత్రి ఈత చెట్లు దగ్ధమవుతున్నట్లు గౌడ కులస్తులకు సమాచారం రావడంతో వారంతా అక్కడికి వెళ్లారు. అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వగా ఘటన ప్రాంతానికి వెళ్లి మంటలు ఆర్పారు. అప్పటికే దాదాపు 500కుపైగా ఈత చెట్లు దగ్ధమైనట్లు గీత కార్మికులు తెలిపారు. ప్రమాదం ప్రమాదవశాత్తు జరిగిందా..?, కుట్రనా..? అనేది విచారణ చేపట్టాలని గీత కార్మికులు కోరుతున్నారు.

పరీక్ష కేంద్రాల్లో వసతులు కల్పించాలి


రాయికల్‌లోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో

రాయికల్: పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల వసతులు కల్పించాలని డీఈవో రాము తెలిపారు. మంగళవారం రాయికల్ పట్టణంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. కేంద్రాల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యం, సీసీ కెమెరాల ఏర్పాటు, విద్యార్థులు కూర్చునేందుకు సరిపడా బెంచీలు తదితర అంశాలపై ఆరా తీశారు. ఆయన వెంట ఉపాధ్యాయులు గంగాధర్, రాజశేఖర్, సీఎం శర్మ, పద్మ, తరంగిణి, వేణు, రజిత, ప్రశాంత్, రమేశ్, నర్సయ్య పాల్గొన్నారు.

పింఛన్ ఇప్పించండి సారు


పెద్ది గంగారాం

జగిత్యాల: పింఛన్ ఇప్పించాలంటూ ఓ తెలంగాణ ఉద్యమకారుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ సాధనకు ఉద్యమం చేశానని, ప్రత్యేక రాష్ట్రం ప్రకటించేంతవరకూ గుండుతోనే ఉన్నానని, నిరాహార దీక్షలు చేసినా.. కవితలతో ఉద్యమానికి అండదండలు అందించినా ప్రభుత్వం కనీసం పింఛన్ కూడా మంజూరు చేయడంలేదని అంటున్నారు. జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామానికి చెందిన తునికి పెద్ది గంగారాం తెలంగాణ ఉద్యమంలో వినూత్న రీతిలో ఉద్యమం చేపట్టారు. తెలంగాణ వచ్చేవరకూ గుండుతోనే ఉంటానని ప్రతినబూనారు. నిత్యం ధర్నాలు, రాస్తారోకోల్లో పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో ఆయనకు ఎలాంటి పింఛన్ మంజూరు కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు గుర్తింపు ఇస్తామని చెప్పిందని, ఇప్పటివరకు స్పందన లేదని, కనీసం పింఛన్ ఇప్పించి న్యాయం చేయాలని కోరుతున్నారు.